# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

ప్రభాత వార్త



శుక్రవారం 27 డిసెంబర్ 2024


## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

### మదనపల్లె ఘటనపై జిల్లా ఎస్పీ విచారణ

**మదనపల్లి క్రైమ్ డిసెంబర్ 26 ప్రభాతవార్త**



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎటువంటివారిపైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. గురువారం మదనపల్లికి చేసిన ఎస్పీ రాత్రి జరిగిన ఘటనపై డిఎస్పీ కొండయ్య నాయుడు, సీఐ రామచంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా సంయమనం పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి జరిగిన చిన్నపాటి వివాదాన్ని కావాలనే పెద్దది చేసేందుకు కొంత మంది ప్రయత్నించారన్నారు. ఇప్పటికే 50 మందిని గుర్తించటం జరిగిందని, మిగిలిన వారు కూడా గుర్తించి వారందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మదనపల్లెలో మత విద్వేషాలు రెచ్చగొడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాధితుడే తమకు న్యాయం జరిగిందని చెప్పినా కూడా వినకుండా కొంతమంది స్టేషన్ వద్దకు వచ్చి గొడవకు దిగడం, ఒక హోటల్ ధ్వంసం చేయడం జరిగిందని వారిపై కూడా చర్యలు తీసుకుంటా మన్నారు. సీసీ కెమెరాల పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అయ్యప్ప భక్తులు కాకుండా ఇతరులు ఎవరెవరు గొడవలో ఉన్నారో గుర్తిస్తున్నామన్నారు. ఇరు వర్గాలు సంయమనం పాటించాలని ఎస్పీ తెలిపారు.

## కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

### - ఆర్ అండ్ బీ స్థలాన్ని పరిశీలించిన ఏఈ ధర్మారెడ్డి

**గాలివీడు, డిసెంబర్ 26(ప్రభాతవార్త):**

కలెక్టర్ ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు సమస్యను చక్కదిద్దే పనిలో పడ్డారు. రేకుల షెడ్లు తొలగించిన స్థలంలో ఏఈ ధర్మారెడ్డి సిబ్బందితో కలిసి గురువారం హద్దులు నిర్ణయించుకునే పనిలో పడ్డారు. ఆయన్ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ స్థలం హద్దులు నిర్ణయించుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఆ స్థలంలో బౌండరీ ఏర్పాటు చేస్తారా లేక కాంప్లెక్స్ నిర్మాణం పనులు చేపడతారా అనే విషయం స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఆర్ అండ్ బీ స్థలంలో ఇంకా కొన్ని నిర్మాణాలు తొలగించకపోవడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# 86 లక్షల మెట్రిక్ టన్నుల బరైటీస్ విక్రయానికి ప్రభుత్వం టెండర్లు

### సి,డి,డబ్లు గ్రేడ్ ఖనిజం కోసం బయర్లు ముందుకు వచ్చేనా?... జగన్ హయాంలో విఫలం

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త**

ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఉమ్మడి కడప జిల్లా ఓబులవారిపల్లి మండలం మంగంపేటలో పెద్ద ఎత్తున నిల్వఉన్న బరైటీస్ ఖనిజం నిల్వలు విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది . ఈ మేరకు ఏపీఎండిసి గురువారం టెండర్ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అత్యంత విలువైన ఏ గ్రేడ్ ఖనిజంతో లక్ష టన్నులు విక్రయించాలని నిర్ణయించింది. బి గ్రేడ్ ఖనిజాన్ని 5 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజం విక్రయానికి టెండర్లను ఆహ్వానించింది. సి,డి,డబ్లు గ్రేడ్ ఖనిజం 20 లక్షల టన్నులు విక్రయించేందుకు టెండర్లు పిలిచింది. జగన్ హయాములో పెద్ద ఎత్తున సి,డి,డబ్లు గ్రేడ్ ఖనిజం వికయించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే సఫలం కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున 60 లక్షల మెట్రిక్ టన్నుల సి,డి,డబ్లు గ్రేడ్ ఖనిజం(వేస్ట్) బల్క్ గా విక్రయించేందుకు నిర్ణయించారు. అయితే ఇంతవరకు ఈ టెండర్లు సక్సెస్ అవుతాయో చూడాల్సిందే. గత గత ఎడాది ప్రభుత్వానికి సుమారు 1500 కోట్ల ఆదాయం ఏపిఎండిసికి వెరైటీస్ ఖనిజం విక్రయంద్వారా సమకూరింది. అయితే ఈ ఎడాది ఏ మేరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందో బల్క్ గా ఖనిజం విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం బట్టే ఏబీఎండికి ఎంత మేరకు ఆదాము వస్తుందో తెలుస్తుంది.



మంగంపేట బరైటీస్ గనులు



ఖనిజాన్ని తరలిస్తున్న దృశ్యం

# నేనున్నా .....అధైర్య పడకండి

**సమస్యల పరిష్కారం కోసం పోరాడుతా... ప్రజాపాలన అందించడంలో మనమే బెస్ట్... ఆపద్ద హామీలు నాచేత కాదు... ప్రజా దర్బార్‌లో వైఎస్ జగన్**





**పులివెందుల, డిసెంబరు 26, ప్రభాతవార్త :**

నేనున్నా ...అధైర్య పడకండి ,ప్రజలు, కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తానని మాజీ ముఖ్యమంత్రి,, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా దర్బారులో వైసీపీ శ్రేణులతోను, కలవడానికి వచ్చిన ప్రజలతో అన్నారు. నాలుగు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మూడవ రోజు గురువారం పులివెందుల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనను కలిసి సమస్యలను వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని కష్టాలు కొన్ని రోజులు వుంటాయి అని కలసి కట్టుగా ఎదుర్కొందాం అని ముందున్నవి మంచి రోజులే అన్నారు. ప్రజా దర్బార్ కు వచ్చిన ప్రజల, వైసీపీ శ్రేణుల నుంచి సమస్యలను వింటూ తోడుగా నేనున్నాను అని ధైర్యం చెప్పారు. ప్రజలు ముఖ్యంగా పెన్షన్ తొలగింపు, భూ ఆక్రమణల గురించి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారానికి అవసరం అయితే పోరాటం కూడా చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరూ అధైర్య పడకుండా ఉండాలి అని అన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే అని అన్నారు. మన పాలనలో దేశంలో.ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కానీ ప్రస్తుతం చంద్రబాబు నాయుడు అబద్ధాల హామీతో అధికారంలోకి వచ్చాడని, అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకోవడం నాకు చేతకాదన్నారు. చెప్తే చేస్తానని చేయలేనివి చెప్పనని ఆయన అన్నారు. వైసీపీ ముఖ్య నేతలతో వైఎస్ జగన్ నేడు జరిగే పోరుబాట పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ విషయాలపై కూడా చర్చించారు. శుక్రవారం చేపట్టబోయే విద్యుత్ చార్జీల పెంపు ధర్నాను విజయవంతం చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి,, కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, శాసన సభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి,, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్ భాష, శ్రీకాంత్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బద్వేల్ ఎంఎల్‌ఏ సుధా, సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**జగసందోహంగా మారిన క్యాంపు కార్యాలయం :**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనం తరలిరావడంతో క్యాంపు కార్యాలయం జన సందోహంగా మారింది. జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు భారీగా జనం తరలివచ్చారు. జగన్ కార్యాలయంతోపాటు ప్రాంగణం అంతా జనాలతో నిండిపోవడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది.

**క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత అదుపు చేసిన పోలీసులు :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఉదయం 9:30 గంటలకు వైఎస్ జగన్ తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించేందుకు వచ్చిన వెంటనే అక్కడికి వచ్చిన జనం జగన్ ను కలిసేదుకు భారీగా రావడంతో తోపులాట జరగడంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు ఎంత చెప్పినా ప్రజలు వినకపోవడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు లాఠీ చార్జ్ చేశారు. ప్రజలను నియంత్రణ చేయడానికి రోప్ తెచ్చి పోలీసులు అదుపు చేశారు. అనంతరం ప్రజా దర్బార్ ప్రశాంతంగా జరిగింది.

## ప్రధానమంత్రి పసల్ బీమా యోజన సద్వినియోగం చేసుకోండి

**సిద్దవటం, డిసెంబరు 26, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలం జ్యోతి గ్రామంలో గురువారం గ్రామ ఉద్యానవన సహాయకులు హెచ్.శ్రీనాథ్ మామిడి పంటల సాగు చేసిన రైతులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ఇన్సూరెన్స్ సౌకర్యం వాటి వలన కలుగు లాభాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎకరానికి రూ.2100 చొప్పున చెల్లించినట్లయితే రూ.42వేలు ప్రకృతి వైపరిత్యంతో దెబ్బతిన్న పంటలకు బీమా వస్తుందన్నారు. బీమా డిసెంబరు 31 వరకు గడువు ఉంటుందని ఈ మధ్యకాలంలో అధిక వర్షం వాతావరణ వ్యత్యాసం అధిక గాలులు తదితర కారణాలతో నష్టం జరిగితే ప్రభుత్వ నిబంధనల మేరకు అంచనా వేసి బీమా వర్తింపచేస్తారు. ఇది కేవలం 5 సంవత్సరాలు పైబడిన మామిడి తోటలకు మాత్రమే బీమా కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో మామిడి పంట సాగు చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం ఆధార్‌కార్డు బ్యాంక్ పాస్ పుస్తకం పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వాలని శ్రీనాథ్ తెలిపారు.

## నేడు వైకాపాచే విద్యుత్ చార్జీలపై పోరుబాట

**మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం విద్యుత్ డివిజనల్ కార్యాలయం నందు పోరుబాట నిర్వహించనున్నట్లు వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11గంటలకు సిటిఎం రోడ్డు నందు గల విద్యుత్ కార్యాలయం ముందు పెంచిన చార్జీలపై నిరసన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డిలు పోరుబాటకు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, జడ్పిటిసిలు, ఎంపిపిలు, కన్వీనర్లు, నాయకులు, కౌన్సిలర్లు నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

## మిట్స్ కళాశాలకు పేటెంట్

**కురబలకోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం వారికి పెటెంట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అనిత, డాక్టర్ నక్కీరన్ విభాగాదిపతి డాక్టర్ దీపాంకర్‌రాయ్, బిటెక్ చివరి సంవత్సరం విద్యార్థి వైష్ణవిలు ఇంటర్‌లాకింగ్ ఇటుకల రూపకృనపై పేటెంట్ హక్కులను సాధించినట్లు ఆయన తెలిపారు. వీటితో తయారు చేసిన ఇటుకలను గోడలు, తోటపడకలు,మార్గాలు, అంచులు, పునాదులు, అంతర్గత, బాహ్య గోడలను నిలుపుకోవడానికి ఉపయోగించవచ్చు అన్నారు. పేటెంట్ హక్కులను అందుకొన్న సివిల్ అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.

## అశేష త్యాగాల చరిత్ర గల పార్టీ సీపీఐ

### భూస్వామ్య,పెత్తందారీ విధానాలను మట్టుబెట్టిన పార్టీ సీపీఐ

**సుండుపల్లి, డిసెంబర్ 26 ప్రభాత వార్త:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత జయంతి వేడుకలు సుండుపల్లె పట్టణంలో సుండుపల్లె మండల కార్యదర్శి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ బుక్కే విశ్వనాథ నాయక్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంత ప్రస్థానంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి అశేష త్యాగాల చరిత్ర గల పార్టీ ఖిసీపీఐఖి అని అన్నారు. భూస్వామ్య,పెత్తందారీ విధానాలను మట్టుబెట్టిన పార్టీ సీపీఐ అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంత ప్రస్థానంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించ భారత కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్లు పూర్తి చేసుకున్నదని అన్నారు. 1925 డిసెంబర్ 26 ఉత్తరప్రదేశ్లోని కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని. చెప్పారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణ త్యాగాలకు లాఠీలకు తూటాలకు లెక్కచేయకుండా అమరులైనటువంటి అమరులకు జోహార్లు అర్పించారు. నాట్ నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పట్ల రాజీలేని పోరాటాలు చేస్తూ పేద ప్రజల కు అండ దండగ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జెండా నిలబడిందని తెలిపారు.. రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల సమస్యల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సుండుపల్లె మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని జరికోన రాళ్ళమడుగు రాయచోటి సుండుపల్లె డబల్ రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల 30 పడుకుల ఆసుపత్రి ప్రజా సమస్యల పట్ల రాజులేని పోరాటాలకు శ్రీకారం చుడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ములకలచెరువు, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**



ములకలచెరువులో భారత కమ్యూనిస్టు పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల సిపిఐ కార్యదర్శి అంజన ఆధ్వర్యంఓ ఈ జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అ సందర్భంగా అంజనప్ప మాట్లాడుతూ పేదల సమస్యలపై పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. పేదల పక్షాన భూమి కోసం భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం పోరాడే జెండా ఎర్రజెండా ఎంతో మంది పోరాటాలు చేసి అమరులై ఉన్నారు. వారి త్యాగఫలితమే పేదలకు అండ అన్నారు. 101సంవత్సరాలుగా పేదల కోసం భూ పోరాటం చేసి పేదలకు భూమిని పంచేవరకు ప్రజ పక్షాన నిలబడి పోరాటాన్ని సాగిస్తామని కార్మికులు శ్రామికుల కోసం కష్టజీవుల కోసం వెట్టిచాకరి విముక్తి కోసం ఎంతటికైనా తెగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా నాయకులు మంత్రాల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం మండ కార్యదర్శి నిజాముద్దీన్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కదిరిరమేష్,బాబు, డప్పు కళాకారు సంఘం రెడ్డప్ప, చంద్ర, భాస్కర్, ఎల్లప్ప, అంజనమ్మ, పాపులమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకొన్న జనసేన నేత సాయినాథ్

**ములకలచెరువు, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**



కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు తైక్వాండ పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయిలో రాణించిన రేఖ, రాధ, ఐశ్వర్య ఈనెలో కోల్‌కత్తాలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నారు. వీరికి అండగా జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ నిలిచి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు రాణించి నియోజకవర్గంకు పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హీరోషోరూమ్ సూరి, ములకలచెరువు ఉపాధ్యక్షుడు లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఆవుల శంకర్, మెడికల్ స్టోర్ ఉత్తన్న, ప్రధాన కార్యదర్శి, ఆంజి, పిటిఎం మండలాధ్యక్షులు శంకర్, సురేంద్ర, కందుకూరు అనీల్, ఉదయ్, అలీఖాన్, గల్లా అంజి, మారుతి ప్రసాద్, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎలవానెల్లూరులో రెవెన్యూ సదస్సు

**రామసముద్రం, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**




మండలంలోని ఎలవానెల్లూరు గ్రామ పంచాయితీలో సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలావానెల్లూరు గ్రామంలో భూ సమస్యలకు సంబంధించిన పత్రాలు ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. 20అర్జీలు వచ్చాయని త్వరగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిర్మలాదేవి సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ వసీం అక్రమ్, విఆర్ఓ మోహన్, ఎంపిటిసి పద్మ, ఈశ్వర్, మధు, జిల్లా రామక్రిష్ణ, డాక్టర్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**నిమ్మనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**




రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా మాజీ టిడిపి అధ్యక్షులు సి.రెడ్డప్ప రెడ్డి అన్నారు. గురువారం నిమ్మనపల్లె మండలం ఆగ్రహారం గ్రామ పంచాయితీలోని శ్రీరాముని దేవాలయ ఆలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సు సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రైతుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలకు చేరువ అవుతున్నారన్నారు. తహశీల్దార్ దనంజనేయులు మాట్లాడుతూ ఈ సదస్సులు వల్ల రైతులకు జరిగే సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి చలపతిరావు, సర్వేయర్ గోఫి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, తాలూకా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రెడ్డి ప్రసాద్, ఆర్ఐ అనంతలక్ష్మి, విఆర్ఓ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలు

అట్లూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త :



భూమికోసం, భుక్తి కోసం శ్రామికుల విముక్తి కోసం అలుపు ఎరగని పోరాటాలు చేస్తూ నిరంతరం పేదల పక్షాన నిలిచి 100 వ సంవత్సరంలో అడుగు డిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు మండలం కొండూర్ కూడలి నందు సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు పీవీ రమణ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తారీఖున కాన్పూర్ నగరంలో పురుడు పోసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ఎన్నో మహోజ్జ్వల చరిత్ర ఘట్టాలతో ముందుకు పోతున్న తరుణంలో అనేక కుట్ర కేసులు బనాయించి ఈ దేశంలో ఎర్రజెండా లేకుండా చేయాలనుకున్న ప్రతి ఒక్కరి ఆశలు అడియాశలు చేసి ఎర్ర సూర్యుని వలె ఎర్రజెండా నిరంతరం బడుగు బలహీన వర్గాల కోసం నిలిచిందని తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాదిమంది కమ్యూనిస్టులను పోగొట్టుకున్నప్పటికీ లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను, జమీందారీ జాగిర్ధరి భూములను పంచిన ఘనత సిపిఐ పార్టీదేనని ఈ దేశంలో రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయ కరణ చేయాలని ఉవ్వెత్తున ఉద్యమాలు నడిపిన సిపిఐ 100 సంవత్సరాలలో ఎన్నో విజయాలు సాధించి మూడు రాష్ట్రాలలో అధికారం కూడా చేపట్టి సోషలిజం లక్ష్యంగా సమసమాజ స్థాపన కోసం ఉద్యమిస్తున్నదని రాబోవు రోజుల్లో పాలక ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఏరియా రైతు సంఘం గోపాల్ రెడ్డి, నర్సారెడ్డి, మురళి, విష్ణు ఓబులేసు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ డివిజన్ ప్రగతిపై సమీక్ష సమావేశం



పీలేరు డిసెంబర్ 26 ప్రభాతవార్త :

జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ రమణ పీలేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో గురువారం పీలేరు విద్యుత్ డివిజన్ పరిధిలోని పీలేరు, గర్నిమిట్ట, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల క్షేత్రస్థాయి అధికారులతో ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ విద్యుత్ బిల్లులు తగ్గించుటకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహములకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకొనుటకు ఒక కిలో వాట్ సామర్థంకు 30 వేల రూపాయలు, రెండు కిలో వాట్స్ సామర్థంకు 60 వేల రూపాయలు మూడు కిలో వాట్స్ సామర్థంకు 78 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని అంతేకాక రాయితీ పోను మిగిలిన మొత్తం కు తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే విధంగా విద్యుత్ వినియోగదారులను చైతన్య పరచాలని అధికారులను ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోండి. లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. పనితీరు మెరుగు పడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అమీర్ భాష, శివయ్య, ఎఇలు, జేఈలు, అకౌంట్స్ శాఖ పాల్గొన్నారు.

## మాలేపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది

యర్రగుంట్ల డిసెంబర్ 26 ప్రభావార్త



మండలంలోని మాలేపాడు గ్రా మం నందు గురువారం పొలం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.వి.నరసింహా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి యన్. శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శనగ, మినుము పంటల పరిశీలించి, మినుము పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు, నీలంరంగు పల్లాలు ఎకరాకు 15 చొప్పున అమర్చుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు తెలియజేశారు. శనగ పంటలో ఎండు తెగులును గమనించడం జరిగినది దీని నివారణకు హెక్షా కొనజోల్ 2 ఎం.ఎల్. లీటర్ నీటికి కలుపుకొని పిచ్చికాలా చేసుకోవాలని తెలియజేశారు. రవి పంటలైనటువంటి సెనగ, మినుము వేరుశనగ, నువ్వులు, వరి పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంటల భీమాను డిసెంబర్ 31వ తేదీ లోపు చేసుకోవాలని తెలియజేశారు పంటల బీమా అప్లై చేసుకోవడానికి రైతులు వారి యొక్క 1బి మరియు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ మరియు పంట ధ్రువీకరణ పత్రంను ఆయ రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా తీసుకొని వెళ్లి సిఎస్‌సి సెంటర్లలో నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## హెడ్ కానిస్టేబుల్ ఆకస్మిక మృతి

రైల్వే కోడూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:



మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ రాజయ్య (50) ఏపీఎస్‌పి హెడ్ కానిస్టేబుల్ తాడేపల్లిలో పనిచేస్తూ గురువారం ఆకస్మికంగా మృతి చెందినట్లు మృతిని బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి భార్యతో వీడియో కాలు మాట్లాడుతూ తనకు మోషన్స్ అవుతున్నాయని చెప్పడంతో రాజయ్య భార్య జాగ్రత్త చూపించుకోమని చెప్పడంతో తనతో పాటు పనిచేస్తున్న పోలీసులు ఆయనను విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ కి తరలించారని అయితే అప్పటికే రాజయ్య మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు మృతుడు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతి చెందిన వార్త తెలుసుకున్న అంబేద్కర్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రైల్వే కోడూరు ఏపీవోగా మృత్యుంజయ

రైల్వే కోడూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండలంలోగా ఏపీవోగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఏపీవోగా మృత్యుంజయ నాయుడు గురువారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ వృత్తికి న్యాయం చేస్తానని మృత్యుంజయరాయుడు తెలిపారు. ఉమామహేశ్వరరావుకు ఇంతవరకు ఎక్కడ పోస్టింగ్ కేటాయించలేదు.

## వైఎస్ఆర్టీపి 2025 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పులివెందుల, డిసెంబరు 26, ప్రభాతవార్త :

వైఎస్ఆర్టీపి పులివెందుల రీజియన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్టీపి 2025 నూతన క్యాలెండర్, డైరీలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం ఉదయం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పలు సమస్యలను జగన్ దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టీపి రాష్ట్ర నాయకులు సికే వెంకటనాథ్ రెడ్డి, జి.సురేష్‌రెడ్డి, జగన్‌రెడ్డి జిల్లా నాయకులు ఎస్. అమర్‌నాథ్‌రెడ్డి, పి. వెంకట రెడ్డి, జి.ఓబుల్ రెడ్డి, కె. ప్రభాకర్ రెడ్డి, వివి పవన్, ఎన్ మదార్‌వల్లి, పద్మనాభరెడ్డి మండల నాయకులు శ్రీనాథరెడ్డి, రామకృష్ణరెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



## విలక్షణ ప్రజానాయకుడు వంగవీటి రంగా

పులివెందుల రూరల్, డిసెంబరు 26, ప్రభాతవార్త :



సాహసమే ఊపిరిగా, ఆత్మవిశ్వాసమే ఆలంబనగా, తానునమ్మిన సిద్ధాంతాల కోసం చివరిక్షణం వరకు పోరాడిన, బడుగు,బలహీన, కార్మిక వర్గాల ఆశాజ్యోతి దివంగత వంగవీటి మోహనరంగా ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే మనందరి తక్షణ కర్తవ్యమని, రాష్ట్ర కాపుసంఘం నాయకులు విజయవాడ ముళ్లపూడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వంగవీటిమోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో అమ్మ సేవాసమితి అధ్యక్షులు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రంగా సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా నాగేశ్వరరావు, జిల్లా కాపునాడు అధ్యక్షులు సమతం రాము, పులివెందుల బలిజసంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్ తదితరరులు హాజరై ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కడపజిల్లా కాపునాడు అధ్యక్షులు సమతం రాము, ఉపాధ్యక్షులు వెంకటేష్, పులివెందుల శ్రీకృష్ణదేవరాయ బలిజసంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్, కార్యదర్శి ఆంజనేయులు, సింహాద్రిపురం మండల బలిజసంఘం అధ్యక్షులు తుపాకుల రాఘవేంద్ర, పులివెందుల విద్యాప్రదాత పాలెం దొరస్వామినాయుడు మనవడు పాలెం శివశంకర్ నాయుడు, సంఘకార్యవర్గసభ్యులు సాగర్, ఏకాశి మహేష్, కృష్ణయ్య, పెద్దవీరయ్య, బ్యాటరీ ప్రసాద్,విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకోవాలి

తొండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సుల ద్వారా భూ వివాద సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని తహసిల్దార్ బి రామ చంద్రుడు అన్నారు. మండలంలోని ఇనగలూరు గ్రామంలో గురువారం పంచాయతీ ఆఫీస్ వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వివాదాలు పరిష్కరించడంలో బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అధికారులు సిబ్బంది అంకితభావాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా సదస్సుల లక్ష్యాన్ని నెరవేర్చాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల లక్ష్యాన్ని అర్థం చేసుకుని నిర్లక్ష్యానికి తావు లేకుండా రెవిన్యూ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డ్యూటీ ఇ రాజేశ్వరి ఆర్ఐ ఏసోబు వీఆర్ఓ నరహరి రైతులు పాల్గొన్నారు.

## సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చినది సిపిఐ

పీలేరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పీలేరు సిపిఐ కార్యాలయంలో గురువారం సిపిఐ జెండా ఆవిష్కరించి అనంతరం కార్యకర్తలకు సభ్యత్వం రెన్యూవల్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గలిగిన సిపిఐ పార్టీ అనేక త్యాగాలు చేసి నిర్బంధాలు ఎదుర్కొని పీడిత ప్రజల గొంతుకై పోరాటాలు చేసి విజయం సాధించిన ఘనచరిత్ర సిపిఐ పార్టీదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి. నరసింహులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్ బాబు రమణ, యశోద, సౌజన్య, శ్యామల, వెంకటరమణ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర గుడికి భూమి పూజ కార్యక్రమం

తొండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :

మండలం పరిధిలోని ఇనగలూరు గ్రామంలో శ్రీ దత్తాత్రేయ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలకు గురువారం తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ కదిరి దస్తగిరి రెడ్డి (బాబు), మోరాంరెడ్డి హరికిషోర్ కుమార్ రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు

రైల్వే కోడూరు అర్బన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త



ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రైల్వే కోడూరు తహసిల్దార్ మెహబూబ్ చాంద్ అన్నారు గురువారం రైల్వేకోడూరు మండలంలోని మాధవరం పోడు పంచాయతీ మాధవరం పోడు గ్రామం నందు రెవిన్యూ సదస్సులను నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ మహబూబ్ చాంద్ మాట్లాడుతూ మాధవరం పోడు గ్రామంలో 73 అర్జీలు వచ్చాయని న్యూ ఎంట్రీ లు, పాసుబుక్కులు, ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని సమస్యలు అందులో కొన్ని ఇక్కడే పరిష్కరించామని మిగిలినవి విచారించి త్వరగా పరిష్కరించే దిశగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లక్ష్మీదేవి, మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్ ,ఫారెస్ట్ అధికారులు,సర్పంచ్, మాజీ సర్పంచ్, వీఆర్వోలు, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

## భూ సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

వేంపల్లి, డిసెంబరు 26, ప్రభాతవార్త :



రైతులకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లి మండలంలోని ముత్తుకూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. గ్రామ సభలో దాదాపు 700 ఎకరాలకు 1బి ఆడంగల్ రావడం లేదని తహశీల్దార్ హరినాథ్ రెడ్డి దృష్టికి రైతులు తెచ్చారు. 1బి, ఆడంగల్ రాని కారణంగా ఇన్సూరెన్స్ కు భీమా చెల్లించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారని పక్కిరా రెడ్డి, లక్ష్మి నారాయణతో పాటు పలువురు రైతులు గ్రామ సభలో అధికారులకు తెలిపారు. అనంతరం తహశీల్దారు హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 1 తర్వాత రైతులు ఎవ్వరూ ఏ ర్యాదు చేసిన సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. అనంతరం రైతులు భూ సమస్యలకు చెందిన వినతిపత్రాన్ని తహశీల్దార్ హరినాథ్ రెడ్డికి అందించారు. ఈ గ్రామ రెవెన్యూ సదస్సులో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి,, నామా వేమా కుమార్, డక్కా రమేష్, గ్రామ రైతులు పక్కిరారెడ్డి, లక్ష్మి నారాయణ, జయరాం, శ్రీనువాసులురెడ్డి, రోషిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సర్వేయర్ గంగయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

## సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 26, ప్రభాతవార్త

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు లక్కిరెడ్డిపల్లెలో సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు పార్టీ జండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు.దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేకమంది త్యాగాలు చేశారని జైలుకెళ్లారని,ప్రాణాలు సైతం తృణప్రాయంగా అర్పించారన్నారు. భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు.నేటికీ కష్టజీవుల సమస్యల పోరాటం కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తోందని గుర్తుకు చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు కె ఓబులేసు జగదీష్ గంగయ్య మహిళా సమాఖ్య నాయకురాలు ప్రమీల ఓబులమ్మ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మైదుకూరు,డిసెంబర్ 26,ప్రభాతవార్త:

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక వీణ విజయరామరాజు కాలని నందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూ 1925 సంవత్సరం డిసెంబర్ నెల 26వ తేదీన భారతదేశంలో అభివృద్ధి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశ స్వతంత్ర పోరాటంలో క్రియాశీల భూమిక పోషించిందని స్వతంత్ర పోరాటంలో కమ్యూనిస్టు వీరులు ఎంతోమంది అమరులయ్యారని స్వాతంత్రం సిద్ధించిన నాటి నుండి నేటి వరకు భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ యువజన విద్యార్థి, కార్మిక, కర్షక మహిళ సంఘాలుగా ఏర్పడి బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తూ వారి హక్కులను కాపాడుతుంది. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏ.వి శివరామ్, బి.పీరయ్య, సుబ్బరాయుడు, లక్ష్మయ్య, ప్రకాశం, లక్ష్మయ్య, ప్రసాద్, బాలసుబ్బయ్య, సుబ్బయ్య, సుబ్బమ్మ, లక్ష్మమ్మ, వి.వి.ఆర్ కాలని కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## జ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రొద్దుటూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త



శుక్రవారం సుమారు 300 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జ్యోతిఫుడ్స్ అధినేత జక్కా పెద్దన్న తెలిపారు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఇండస్ట్రియల్ హబ్బ్ ఏర్పాటు చేసేందుకు జ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో వివిధ రకాలైన నాన్‌వెజ్ పచ్చళ్ళు, ఫామింగ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అందులో పని చేయుటకు రాయలసీమ ప్రాంత వాసులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ప్రొద్దుటూరు పట్టణంలో మూడు రోజులపాటు 27 28 29 తేదీలలో జాబ్ వేల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జ్యోతి ఆధ్వర్యంలో తెలంగాణలో పెద్ద ఎత్తున ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. జ్యోతి ఫుడ్స్ కంపెనీ లోగో ఆవిష్కరణకు 27 శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అరుణ్ సుబ్బారావు పాల్గొన్నారు.

## రసాబసగా సాగిన కౌన్సిలర్ సమావేశం



యర్రగుంట్ల డిసెంబర్ 26 ప్రభావార్త

కౌన్సిలర్ సమావేశాలు టీ బిస్కెట్ల కోసం మేనా వార్డు సమస్యలను పట్టించుకోలేదని వార్డు కౌన్సిలర్ వాదన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా జరిగింది. గురువారం పలు సమస్యలపై వార్డు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా దినసరి కూలీలను ఏ విధంగా తీసుకుంటారని కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు దాసరి సూర్యనారాయణ రెడ్డిలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో సుమారు 40 కుటుంబాలు దాకా నివాసం ఉన్నారని వారికి సరైన రోడ్లు నీటి వసతి లేదన్నారు. వాటికి వెంటనే వసతులు కల్పించాలని, రైల్వే స్టేషన్ నుంచి గ్యాస్ గోడౌన్ వరకు రోడ్డు కిరువైపులా కంప చెట్లు పెరిగాయని, పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, రాత్రి వేళలో లైట్లు వెలగట్లేదని పలు సమస్యలను అడిగారు. బడ్జెట్ సమావేశంలో బడ్జెట్ పై చర్చ జరగకుండా మిగతా వాటిని చర్చకు పెట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మున్సిపల్ ఏఈ సురేష్ బాబులు కౌన్సిలర్లు ఆడిగిన ప్రశ్నలకు సానుకూలంగా సమాధానాలు ఇచ్చి సమస్యలకు త్వరితగతన పరిష్కారం చూపుతామన్నారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జై బునిసా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరద గెలుపులో కొనిరెడ్డి పాత్ర శూన్యం

ప్రొద్దుటూరు డిసెంబర్ 26 ప్రభాతవార్త



నియోజకవర్గం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విజయం సాధించడంలో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాత్ర శూన్యమని మున్సిపల్ కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని తామే ఓడించామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కొత్తపల్లె పంచాయతీ పరిధిలో వైసీపీ కన్నా కొనిరెడ్డి శివచంద్రారెడ్డి బలపరిచిన తెలుగుదేశం పార్టీకి కేవలం 73 ఓట్లు మాత్రమే మెజారిటీ వచ్చిందని గుర్తు చేశారు. గత గ్రామ వార్డు ఎన్నికలలో జగన్ బొమ్మతోనే కొడిరెడ్డి కుమారుడు పోటీ చేసి గెలుపొందిన సంగతిని గుర్తు చేశారు. అప్పుడే జగన్‌ను వదిలి టిడిపి పక్షాన పోటీ చేసి ఉంటే నీ సత్తా ఏమిటో బయటపడి ఉండేదని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కొత్తపల్లె పంచాయతీలో 73 ఓట్ల మెజారిటీ తెచ్చుకున్న కొండిరెడ్డి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని విమర్శించే అర్హత కోల్పోయారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి వైసిపి యువ నాయకులు ద్వార్శల గురునాథరెడ్డి లు పాల్గొన్నారు.

## పంట నమోదును పరిశీలించిన డిఏఓ



చిన్నమండెం డిసెంబర్ 26 ప్రభాతవార్త :

మండలంలోని దిగువగొట్టివీడు రైతుసేవా కేంద్రం పరిధిలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ ఈ పంట నమోదును పర్యవేక్షించడం జరిగింది. రబీ సీజనులో సాగు చేసిన పంటలను రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలియజేసారు. అలాగే ఈ పంట నమోదుతో పాటు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని తెలియజేసారు. ఈ పంట నమోదు చేయించుకోవడం వలన ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల పథకాలకు అర్హులు అవుతారని తెలియజేసారు. ఇన్సూరెన్స్ ఒక ఎకరాకు వరి కి 126/ టమాట 1600/మామిడి 2250/ 31/12/2024 తేది లోపు రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రాజేష్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## అరటి కొబ్బరి చెట్లను నరికిన గుర్తు తెలియని వ్యక్తులు

### పోలీసులకు పిర్యాదు

చిన్నమండెం డిసెంబర్ 26 ప్రభాతవార్త:

మండలంలోని కొత్తపల్లి గ్రామ కస్పాకు చెందిన చింతం రవీంద్రారెడ్డికి చెందిన మామిడితోపులో వున్న మూడు కొబ్బరి, మూడు అరటి చెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ మేరకు చెట్లు నరికిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

## ఘనంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలు



పెనగలూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

తిరుమల రాజుపేట గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత జయంతి ఉత్సవాలు గురువారం నిర్వహించడం జరిగినది. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ. 100వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భముగా ఘనంగా ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఏరియా కార్యదర్శి జ్యోతి, చిన్నయ్య, అన్నమయ్య జిల్లా ఏఐటియుసి కార్యదర్శి మాదరాజు గంగాధర్, అతిథులుగా హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమం పెనగలూరు మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు చలపతి, ఈరి విజయ్ భాస్కర్, రేపూరి శంకరయ్య, ఓబులేసు, మండల సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ డిహెచ్పిఎస్ పంది కాయల రామయ్య, మండల కార్యదర్శి ఈరి సుబ్బరాయుడు, తిరుమల రాజుపేట గ్రామస్తులు ఈరి కిష్టయ్య ఈరి, గోపాల య్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది

లక్కిరెడ్డిపల్లి ;డిసెంబర్ 26, ప్రభాతవాక



దివ్యాంగుల పిల్లలో అభివృద్ధి కోసం ప్రభుత్వము ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఎంఈఓ చక్రనాయక్ పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విద్యా విధానాలు అమలుపరిచేందుకు ఎన్నో కార్యక్రమాలు ఇంటి వద్దనే విద్య పాఠశాల వచ్చేందుకు ట్రాన్స్‌షన్ ఎస్కార్ట్ అలివెన్స్ గర్ల్స్ స్టైప్ మొదలైనవి ఇస్తోందని వీటిని దివ్యాంగులు సద్యనం చేసుకోవాలన్నారు. అలాగే దాత పాపులర్ షూ మార్ట్ ఓనర్ పి హరినాథ రెడ్డి 30 మంది దివ్యాంగ పిల్లలకు దుప్పట్లు వితరణ చేశారు. వీటిని ఎంఈఓ చక్రా నాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలుర ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి పాఠశాల ఐఆర్టి ఉపాధ్యాయుడు మనోహర్ యాజమాన్య కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు దివ్యాంగుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వీరబల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

మండలంలోని మహిళ అభ్యర్థులు వివాహితులు అయి ఉండి 35 సంవత్సరాల వయస్సులోపు వారు అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ లలితమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఆరు ఆయా పోస్టులకు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు సంబంధించి ఆయా కేటగిరీల వారు అప్లై చేసుకోవాలని తెలిపారు. మండలంలో 1. ఈడిగపల్లి ఎగువపల్లి (బిసి బి), 2. ఎంకే వడ్డేపల్లి( బీసీఏ), 3. బలిజపల్లి( ఓసి), 4. కమ్మ పల్లె (ఓసి), 5. పుత్తా వాండ్ల పల్లి (ఓసి), 6.పెద్దూరు పెద్ద మాదిగ పల్లి,( విహెచ్), కేటగిరీలవారు సుండుపల్లెలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నందు జనవరి 2 వ తారీఖు లోపల అప్లై చేసుకోవాలని తెలిపారు.

## శత దినోత్సవ వేడుకల్లో కమ్యూనిస్టు పార్టీ

యర్రగుంట్ల డిసెంబర్ 26 ప్రభాతవార్త



గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ యర్రగుంట్ల మండల సమితి ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా మార్క్స్ భవన్ సిపిఐ కార్యాలయం యందు సిపిఐ సీనియర్ నాయకులు టిసి ఓబుల్ రెడ్డి పతాకావిష్కరణ కావించాడు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన ఆవిర్భవించడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాలకు సంబంధించి వారి సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు కొనసాగించిందన్నారు నేటికీ బడుగులకు అండగా ఉన్నది ఎర్రజెండానేనని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంజుల జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ చాంద్బాషా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎస్ రమేష్,ఆశా కార్యకర్తలు నాయకురాలు గంగమ్మ తదితరులు మాట్లాడుతూ ఇవాళ కార్మికులు కర్షకులకు అండగా ఉంటున్నది కమ్యూనిస్టు పార్టీ అని కమ్యూనిస్టు పార్టీ నూరు సంవత్సరాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పైన ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కోసం పోరాటాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు కార్యక్రమంలో మండల కార్యదర్శి భవాని శంకర్ జమ్మలమడుగు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం నారాయణ నాయకులు ఈ శరత్ ఫోర్ వీల్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దానం గఫార్ రఫీ అంగన్వాడి కా ర్యకర్తలు పాల్గొన్నారు అనంతరం తిప్పలూరులోని అమరవీరుల స్తూపం కామ్రేడ్ గూడూరు, ఆదాము కామ్రేడ్ అచ్చువెల్లి ధైర్యం స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా నాయకులు గంగయ్య తిప్పలూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మండల పూజా ముగింపు వేడుకలు




**రాజంపేట అర్బన్, డిసెంబర్ 26 ప్రభాతవార్త**

రాజంపేట అయ్యప్ప ఆలయంలో మండల పూజా మహోత్సవం ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. శబరిమల ఆలయంలో ఈరోజు సాయంత్రం ప్రత్యేక పూజ అనంతరం స్వామికి భస్మాభిషేకం తో గుడి తలుపులు మూస్తారు. రాజంపేటలో కూడా ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాల అనంతరం పవిత్ర పదునెట్టాంబడికి ప్రత్యేక పూజలు చేశారు.18 కళాశాలకు ప్రత్యేక పూజలు చేశారు, పూజల తర్వాత పదునెట్టాంబడికి కర్పూర హారతి తో స్వామియే శరణం నామస్మరణ మధ్య ఓన్నాం తిరుబడి శరణపు అయ్యప్ప పాట పాడుతుండగా ప్రతి ప్రతిమెట్టుకు కర్పూర హారతి వెలిగించి ఘనంగా పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి నాగరాజు, వెంకటరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పాల ప్రకాష్, డైరెక్టర్లు దాము ఆచారి, రమేష్ బాబు, పలువురు గురు స్వాములు ,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈనెల 31 నుంచి ఆలయంలో మకర విలక్కు పూజలు ప్రారంభమవుతాయి.

## పట్టణాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**



పట్టణాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్‌హాలులో కౌన్సిల్ సాధారణ, బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే మార్చినెల నుంచి సిఎంఎఫ్ఎస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపాలిటి నిధులు మున్సిపాలిటిలోనే ఖర్చు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొందన్నారు. 35వార్డుల్లోనూ సమస్యలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఫాగింగ్ మిషన్లు మరమ్మత్తులు చేసి దోమలను నివారించాలన్నారు. రోడ్లు, శానిటేషన్, డ్రైనేజి, వాటర్ సప్లైపై దృష్టి పెట్టాలన్నారు. మున్సిపల్ పక్కా భవన నిర్మాణానికి ఇరిగేషన్ కార్యాలయం వద్ద రెండు ఎకరాల స్థలం కేటాయింపుకు కౌన్సిల్ ఆమోదం చేయాలన్నారు. అనంతరం ఛైర్మెన్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అభినందనీయమన్నారు. కౌన్సిలర్లు ఫర్జానా, మెబీనా, ప్రసాద్, వశీం, రాజేష్, గాంధీలు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. దీంతో వార్డుల్లో ప్రజలకు సమాదానం చెప్పలేకపోతున్నామన్నారు. అధికారులు వార్డుల్లో ప్రోటోకాల్‌ను పాటించడం లేదన్నారు. వైస్ ఛైర్మెన్ జింకా చలపతి మాట్లాడుతూ మున్సిపాలిటికి చెందిన రూ.40కోట్లు సిఎంఆర్ విధానంలో ప్రభుత్వం వద్ద ఉందని తిరిగి మున్సిపాలిటికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్‌లో కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైస్ ఛైర్మెన్ నూర్‌అజం మాట్లాడుతూ పట్టణంలో కుక్కబెడద ఎక్కువగా ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. కమీషనర్ ప్రమీళ మాట్లాడుతూ కౌన్సిల్‌లో కౌన్సిలర్లు తెలియజేసిన అంశాలపై పరిష్కారానికి చర్యలు తీసుకొంటానన్నారు. బిల్లులు పెండింగ్ వల్ల గుత్తేదారులు సకాలంలో పనులు చేపట్టలేకపోతున్నారన్నారు. అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్ రూ.114,59కోట్లు అంచనాతో కౌన్సిల్‌మీట్‌లో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో కొన్ని వార్డులకు మొండిచెయ్యిచూపారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేద్దాం



**వాల్మీకిపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త ః**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేద్దామని ఎంపీడీవో సుధాకర్‌రాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది ఈ సమావేశానికి ఎంపీపీ అరుణమ్మ గైర్హాజర్ కావడంతో ఆమె స్థానంలో వైస్ ఎంపీపీ డాక్టర్ వెంకట్రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలం నడుస్తున్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలని సూచించారు. మేజర్ పంచాయతీలతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అలాగే గ్రామాల్లో పారిశుద్ధం పనులు మెరుగ్గా ఉండే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిపనులు కూలీలందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పాడైపోయిన రోడ్లతోపాటు, ఇబ్బందులు ఉన్న రోడ్లు ఉంటే తమ దృష్టికితీసుకువాలని, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సహకారంతో రోడ్డు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తదుపరి మండలంలోని వివిధశాఖల అధికారులతో చర్చించి, శాఖపరమైన సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ, జడ్పీటీసీ సభ్యురాలు నిర్మల, వైస్ ఎంపీపీ కిరణ్, మండల స్థాయి అధికారులు, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్‌లు పంపిణీ



**మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**

పారిశుద్ధ్య కార్మికులకు యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏఆర్.సురేష్ రేయిన్‌కోట్‌లను పంపిణీ చేశారు. గురువారం కరాటే కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కార్మికుల సేవలను వెలకట్టలేనివన్నారు. పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా రెయిన్‌కోట్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పట్టణం పరిశుభ్రతకు కృషి చేస్తున్న కార్మికుకు తనవంతు సహాయ సహాకారం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఎం అభినయఖాన్ పాల్గొన్నారు.

## నష్టాల బాటలో చింతపండు వ్యాపారులు

**కురబలకోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



ఈ ఏడాది మార్కెట్‌లో ఆశించిన ధరలు పలకకపోవడంతో చింతపండు వ్యాపారులు నష్టాలను చవిచూస్తున్నారు. సీజన్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేశారు. ముడిసరుకును కరిపులి, చపాతి, ఫ్లవర్ రకాలుగా తయారు చేసి శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. సీజన్‌లో కరిపులి, 90రుపాయల నుంచి 125ల వరకు ఫ్లవర్ రకం రూ.50నుంచి 70ల వరకు, చపాతి రూ.45 నుంచి 55ల వరకు కొనుగోలు చేశారు. కట్టిచింతపండు బండి రూ.18వేల నుంచి 25వేల వరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచారు. ప్రస్తుతం ఇవే ధరలకు వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. శీతల గిడ్డంగుల బాడుగలు, రవాణాచార్జీలు, ప్యాకింగ్, ఎగుమతి, దిగుమతి కూలీలు, పెట్టుబడులపై వడ్డీలు కలసి దీంతో వ్యాపారులపై పడుతోంది. మార్కెట్‌లో ధరలు మాత్రం అనుకూలించకపోవడం ఏడాది ముగుస్తుండడంతో కొత్త రకం చింతపండు జనవరి 15కు రానుండడంతో చేసేదిలేక వ్యాపారులు తెగనమ్ముకొంటున్నారు.

## జడ్పీ హైస్కూల్ కందూరు అటల్ ల్యాబ్‌కు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థుల శిక్షణ

**కలికిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

కందూరు జడ్పీ హైస్కూల్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు జేఎన్‌టీయూ కలికిరి ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులను మెంటార్స్‌గా బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ అనుసంధానం చేశారు. కందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో జేఎన్‌టీయూ కలికిరి కళాశాల విద్యార్థులు ప్రతి శనివారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల విద్య నుంచే నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడింది. ఈ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులు ఎంతగానో ఆసక్తిని కలిగించాయి. జేఎన్‌టీయూఏ కలికిరి నుంచి డా.కె.అపర్ణ మార్గదర్శకత్వంలో ఐదుగురు విద్యార్థులు జడ్పీహైస్కూల్ కందూరు ప్రాజెక్టులను చేయించారు. కొత్త భావనలను అన్వేషించడంలో యువ అభ్యాసకులకు సహాయం చేయడానికి విద్యార్థులు పాల్గొనే వారికి మార్గదర్శకత్వం వహించారు. వినూత్న నమూనాలను ప్రదర్శించారు. సందర్శించిన జేఎన్‌టీయూ కలికిరి విద్యార్థులు మరియు అధ్యాపకులు భవిష్యత్ ఆవిష్కర్తలను ప్రేరేపించడానికి అంకిత భావంతో ఉన్నారని జడ్పీ హైస్కూల్ కందూరు ప్రధానోపాధ్యాయులు ఎన్.రమణారెడ్డి, మరియు అధ్యాపకులు చంద్రశేఖర్, హైదర్‌వల్లీ, శ్రీలక్ష్మీలు ప్రశంసించారు.

## వేరుశనగ పంటపై అడవి పందుల దాడి



**సుండుపల్లి, డిసెంబర్26, ప్రభాతవార్త:**

మండలంలోని కుంటలముందర కు చెందిన కె నాగిరెడ్డి పొలంలో అడవి పందులు దాడి చేసి నట్లు ఆయన తెలిపారు. అప్పులు చేసి, నాన తిప్పలు పడి పంటలు వేస్తే తమ దురదృష్టం కొద్ది అడవి పందులు పడి ఉన్నపంటలు నాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా ఒక ఎకరా పూర్తిగా దెబ్బ తిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం అడవి పందుల నుండి కాపాడి తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## హంద్రీ-నీవా నిర్వాసితులకు ఎమ్మెల్యేచే పట్టాలు పంపిణీ

**మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**

హంద్రీ-నీవా కాలువ, ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు గురువారం ఎమ్మెల్యే ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. రూరల్ మండలం వలసపల్లె దగ్గర నాయినివారిపల్లెకు చెందిన 32మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఇంటిపట్టాలు పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12ఏళ్ళ క్రితం కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి మంజూరైన ఇండ్లపట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ళలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ అధికారులు, నాయకులు జునైద్‌అక్బరీ, చంద్రశేఖర్‌నాయుడు, కత్తిలక్ష్మన్న, మహేష్, బెల్లె రెడ్డిప్రసాద్, షంషీర్, రఘుపతినాయుడు, జీవినాయుడు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జేసిబి మధు, ద్యాన్స్ రెడ్డప్ప, వేణు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సబ్సిడీతో ఎస్సీ ఎస్టీ గృహాలకి సోలార్ రూఫ్ టాప్

### జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ రమణ



**కలకడ ,డిసెంబర్ 26 ప్రభాతవార్త ః**

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ తో ఎస్సీ ఎస్టీ వినియోగదారుల గృహాలకి ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయుటకు ఎస్సీ ఎస్టీ వినియోగదారులచే జరుగుతున్న నమోదు ప్రక్రియ పురోగతిపై అన్నమయ్య జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ రమణ కలకడ మండలం కొత్తపల్లి హరిజనవాడలో క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించారు. వినియోగదారుడి యొక్క సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తి అయిన యూనిట్లలో తాను వాడుకోగా మిగిలిన యూనిట్లకు ఒక్కొక్క యూనిట్ కి రెండు రూపాయల మూడు పైసలు చొప్పున తిరిగి చెల్లిస్తారని తెలియజేశారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. పి యం సూర్యఘర్. గవర్నమెంట్. ఇన్ వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఇంటి పైకప్పు పైన కనీసం 10 చ. మీ./ 100 చ. అడుగుల స్థలములో 1 కిలో వాట్ ప్లాంటుని ఏర్పాటు చేయవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఎస్సీ ఎస్టీ వినియోగదారులు లబ్ధి పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, తదితర విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## 31న పింఛన్ల పంపిణీ

**దువ్వూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 15గ్రామ సచివాలయాల పరిధిలో డిసెంబర్ 31వ తేదీనే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై కార్యదర్శులు, సంక్షేమ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదిన కాకుండా 31వ తేదీనే పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మండలంలో 7233మంది వికలాంగులు, వితంతువులు, వృద్ధాప్య పింఛన్లు ఉన్నాయన్నారు. వాటికి గాను 15గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 125మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 3కోట్ల 5లక్షల రూపాయలు పింఛన్ల పంపిణీకి మంజూరు చేసినట్లు తెలిపారు. 31వ తేదినే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఆక్రమిత భూములను పరిశీలించిన రెవిన్యూ అధికారులు



**కాశినాయన, డిసెంబరు 26, ప్రభాతవార్త**

శ్రీ అవధూత కాశినాయన మండలం గొంటువారి పల్లి గ్రామములో ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూములను గురువారం రెవిన్యూ అధికారులు పరిశీలించారు. గొంటువారిపల్లె రెవిన్యూ పొలం సర్వే నెంబర్ 1711, 1741 లో దాదాపు 12 ఎకరాలు వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురై చుట్టూ ముళ్ళకంచె వేయడంతో రైతులు తమ భూముల్లోకి వెళ్ళడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు రెవిన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాశి నాయన తహశీల్దారు వెంకటసుబ్బయ్య ఆక్రమణకు గురైన వాగు, పోరంబోకు ,ప్రభుత్వ భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ భూములలోని ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. అమర్నాధ్‌రెడ్డి, వి.ఆర్.ఓ నాయబ్ రసూల్, సర్వేయర్ నవదీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాఖరాజుపల్లెలో రెవెన్యూ సదస్సు



**సిద్దవటం, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని శాకరాజుపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించి రైతు భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేత మాజీ జడ్పీటీసీ సభ్యులు చలమయ్య యాదవ్ పాల్గొని రైతు భూ సమస్యలపై అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శాఖరాజుపల్లి రెవెన్యూ పరిధిలో ఎన్నో భూ అన్యాక్రాంతాలు మితిమీరి పోయాయని కొండలు, వాగులు పూర్తిగా అన్యాక్రాంతం చేశారని మా రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు భూ సమ్యలపై పరిష్కార దిశగా ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారని అర్జీ ఇచ్చిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత మాట్లాడుతూ రైతు భూ సమస్యలపై 13 అర్జీలు సమర్పించారని సమస్య పరిష్కారం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ పసుపులేటి శ్రీనివాసులు, వీఆర్వో శివశంకర్, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీ నరసింహాస్వామికి పూజలు

**మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్‌లో వెలసియున్న శ్రీ అభయలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్రం సందర్బంగా లక్ష్మీనరసింహాస్వామికి వైభవంగా పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామున స్వామికి అభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆలయంలో ఘనంగా స్వామివారికి పూజలు జరుగుతున్నాయి. పూజలకు విచ్చేసే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా సంక్రాంతి వరకు స్వామివారికి సూర్యుడు ఉదయించే లోపే అభిషేకాలు జరుగుతున్నాయి. ఆలయ ఛైర్మెన్ దయ్యాల మల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి రోజూ వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు.

## కెఎస్ఆర్ఎమ్‌లో 5 డేస్ ఎఫ్‌డీపి

**కడప డిశంబరు 26 ప్రభాతవార్త :**



స్థానిక కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ డిపార్ట్మెంట్ వారూ సమస్యఆధారిత డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై 5రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం 26, 30 డిసెంబర్ వరకూ నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా గెస్ట్‌ఆఫ్ హానర్ షేక్ యాసిన్ షరీఫ్, స్టార్టప్ ఎనాబెలర్, విళిళిదినిలి, ఐఐఎం బెంగుళూర్, మాట్లాడుతూ డిజైన్ థింకింగ్, ప్రాక్టికల్ అప్రోచ్ అబ్జర్వేషన్ మెథడ్స్, డేటా సేకరణ, కేస స్టడీ, టీమ్ ప్రెజెంటేషన్ మీద విశ్లేశత్మక వివరణ ఇచ్చారు. కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఐడియా జనరేషన్ వర్క్‌షాప్, ఇన్నోవేటివ్ సొల్యూషన్ డెవలప్మెంట్స్ మరియు స్టూడెంట్ రీసెర్చ్ సెంటర్ వంటి డిజైన్ థింకింగ్ ప్రాక్టికల్ సెషన్స్ మరిన్ని పెరగాలని కోరారు. ప్రోగ్రామ్ కన్వీనర్లు, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి డాక్టర్ విజయ కిషోర్ మాట్లాడుతూ ప్రొటో టైప్ డిజిటల్ టూల్స్, యూజర్ టెస్టింగ్ మెథడ్స్, ప్రొటోటైప్ రిఫైనేమెంట్, వంటివి ఈ సదస్సు ద్వారా తెలుస్తుందన్నారు. డాక్టర్ ఎం. వి.నారాయణ, డీన్ఆర్‌డీ మాట్లాడుతూ డిజైన్ థింకింగ్ ప్రోగ్రామ్ సొల్యూషన్ డెవలప్మెంట్స్ ఉపయోగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మధుసూధన్ రెడ్డి, పి.సుబ్బారాయుడు, వివిధ కాలేజెస్ నుంచి ఫ్యాకల్టీ హాజరయ్యారు.

## ఎమ్‌పిపి నిధులతో రోడ్డు ఫార్మేషన్

**సుండుపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**



మండలంలో పెద్దబలిజపల్లి కు ఎమ్‌పిపి నిధులతో రోడ్డు మంజూరు అయినట్లు రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు రామా. శ్రీనివాస్ తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు మరియు సంక్రాంతి పండుగ సందర్భంగా కాటమరాజు గుడి (చిట్లకుప్ప) వద్దకు భక్తులు, రైతులు చుట్టుపక్కల గ్రామస్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సౌకర్యంగా ఉండేందుకు రోడ్డు లేనందున సౌకర్యం కల్పించారు. జనసేన నాయకుడు రామ శ్రీనివాస్ సంబంధిత శాఖ అధికారులను మాట్లాడి మండల గ్రాంట్ లో ఎంపీపీ రాజమ్మ నిధుల ద్వారా రోడ్డు ఫార్మషన్ పనులు ప్రారంభించి నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రైతులు, మాజీ ఎంపీటీసీ నంద్యాల రామయ్య, శివశంకర్, నంద్యాల సిద్దయ్య (జేసీబీ),నేతి రవీంద్ర, అన్నయ్యగారి రవీంద్ర,రెడ్డిచెర్ల మదన్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా



**బద్వేలు, డిసెంబర్ 26 (ప్రభాత వార్త)**

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా సమస్యల పోరాటానికి తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు కాపు ముద్దుబిడ్డ వంగవీటి మోహన్ రంగా అని బలిజ సేవా సంఘం అధ్యక్షులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, మాజీ బలిజ సేవా సంఘం అధ్యక్షులు డీవీలు పేర్కొన్నారు. గురువారం బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి, నమ్మిన పేద ప్రజల జీవితాల కోసం నిలబడ్డ గొప్ప వ్యక్తి వంగవీటి రంగా అని ఆయన సేవలను కొనియాడారు. అలాగే వంగవీటి రంగా తమకు ఎప్పటికీ స్ఫూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొంకుల రమణ, అడ్వకేట్ మువ్వా నరసింహులు మనం వెంకటసుబ్బయ్య, ఆవుల సుబ్బారావు, గనమంతు రాజేష్, శ్రీనివాసులు, భాసికాల శ్రీనివాసులు మరియు సింగంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం



**కమలాపురం, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

తన తండ్రి తాము చదివిన పాఠశాల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని దాదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్ద చెప్పలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత వాటర్ ప్లాంట్‌ను యోగివేమన యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ కళావతి మరియు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఇదే పాఠశాలలో చదివారని తాను తన తమ్ముడు తన చెల్లెలు అందరం ఇదే పాఠశాలలో చదివామని ప్రస్తుతం అందరం వివిధ హోదాలలో ఉన్నత స్థానంలో ఉన్నామని ఆయన తెలిపారు. ఏటా పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానం వచ్చిన విద్యార్థులకు రూ.5116 నగదు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ పాఠశాలకు ఏ అవసరమొచ్చినా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుభాషిణి, చంద్రకాంత్‌రెడ్డి, డా.మాధవీ, ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ పుల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గుజ్జుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సీమెంట్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలి

**దువ్వూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

పల్లె పండుగ సందర్భంగా దువ్వూరు మండలానికి సుమారు 2కోట్ల 50 లక్షల రూపాయలు సిమెంట్ రోడ్లు మంజూరు అయ్యాయని వాటిని సంక్రాంతి లోగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇడమడక, గుడిపాడు, చింతకుంట గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్లను ఆయన పరిశీలించారు. మండలానికి 37పనులు మంజూరు అయ్యాయని ఇంకా 17పనులు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి అయితే తిరిగి పనులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పనుల్లో నాణ్యతా పరంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ మధుసూధన్ బాబు, ఏఈ సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

